## క్లుప్తంగా

### మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారి ఉత్సవ మూర్తికి ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం రూరల్:** గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి ఆదాయం రూ: 1,49,222 వచ్చినట్లు, 1500 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో తెలిపారు. స్వామివారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కీసరి సరిత, ఆలయ ఈవో ఆకుల కొండలరావు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఈవో, చైర్మన్‌లు శేషవస్త్రాన్ని కప్పి సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

### అనంతలక్ష్మికి సత్కారం



బయ్యనగూడెంలో అనంతలక్ష్మిని సన్మానించిన దృశ్యం

**కొయ్యలగూడెం:** నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బయ్యనగూడెం సర్పంచ్ లింగిశెట్టి అనంత లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామంలో అనంతలక్ష్మీని నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర్ల నాగరాజు, రాష్ట్ర సెక్రటరీ కొప్పాక వీరవెంకట సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోటిపల్లి శేఖర్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కొప్పాక వెంకటేశ్వరావు, మాజీ ఉమ్మడిజిల్లా అధ్యక్షులు తురాయి శ్రీను, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు పెద్దేహపు వీర వెంకట సత్యనారాయణ, చింతలపూడి నియోజకవర్గ సెక్రటరీ నందిగం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

### నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

**జంగారెడ్డిగూడెం:** పట్టణంలోని 8వ సచివాలయం అశ్వారావుపేట రోడ్-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీలో వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ

**పోలవరం రూరల్:** వైద్యశాలకు వచ్చిన రోగుల పట్ల ప్రేమతో వ్యవహరించి వారికి అవసరమైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. వైద్యశాల పరిస్థితులపై వైద్యాధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నార్గాని పోసిబాబు, ఇళ్ల కళ్యాణ్, ధూళి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

### న్యాయం దృష్టిలో అందరూ సమానమే



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

**జంగారెడ్డిగూడెం:** న్యాయం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమే అని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ సామాజిక న్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పలువురు న్యాయవాదులు సామాజిక న్యాయంపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. న్యాయవాదులు బండారు లతాకుమారి, వామిశెట్టి హిమబిందు, గెద్ద గాయత్రీ ప్రధాన ఉపాధ్యాయురాలు లోవ కుమారి పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో పోలవరం



అంతర్వేదిగూడెంలో నాడు-నేడు పథకంలో రూపుదిద్దుకున్న గిరిజన సంక్షేమ పాఠశాల




- మారిన గ్రామాల రూపురేఖలు
- ఆధునిక వసతులతో ప్రభుత్వ బడులు, ఆసుపత్రులు
- ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- అభివృద్ధి పనుల వ్యయం రూ.665.77 కోట్లు
- సంక్షేమ లబ్ధి – రూ.923.14 కోట్లు

**బుట్టాయగూడెం:** ఒకప్పుడు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న పోలవరం (ఎస్టీ) నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రగతి పరుగులు తీస్తోంది. టీడీపీ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన ప్రాంతం నేడు మారిన రూపురేఖలతో అబ్బురపరుస్తోంది. గతంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలు నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పాఠశాలల రూపంమారి కొత్త ఒరవడితో కార్పొరేట్ హంగులతో అలరారుతున్నాయి. నాడు కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వాస్పత్రులు నేడు ఆధునిక వసతులు, పరికరాలతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా మన్యం ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న అడవిబిడ్డలకు నేరుగా వారి ఇంటికే సకల సేవలు చేరుతున్నాయి. పేదరికమే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను ఎక్కడా అవినీతికి తావులేకుండా అందేలా కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. గ్రామాలు నూతన సచివాలయ భవనాలు, విలేజ్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ పాలనపై నియోజకవర్గంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీ జగనే సీఎం కావాలని కోరుకుంటున్నారు.

**నియోజకవర్గంలో రూ. 665.77 కోట్ల అభివృద్ధి పనులు**

నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.665.77 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. వీటిలో నాడు – నేడు పథకంలో సుమారు 153 ప్రభుత్వ పాఠశాలలను రూ.50.69 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరిగింది. అలాగే రూ.47.08 కోట్లతో సచివాలయాలు, రూ.23.50 కోట్లతో 107 రైతు భరోసా కేంద్రాలు, రూ.14.40 కోట్లతో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు మొత్తం రూ.84.94 కోట్లతో నూతన భవనాల నిర్మాణాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ఇంకా అనేక అభివృద్ధి పథకాలు చేపట్టడం జరిగింది.

**సంక్షేమ పథకాల ద్వారా రూ.923.14 కోట్లు**

నియోజకవర్గంలో సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ. 923.14 కోట్లు అర్హులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగింది. జగనన్న దీవెన పథకంలో 5016 మంది విద్యార్థులకు రూ.26.16 కోట్లు, జగనన్న వసతి దీవెనలో 4326 మంది విద్యార్థులకు రూ.12.50 కోట్లు, ఆసరా పథకంలో 59170 మంది గ్రూప్ సభ్యులకు రూ.176.76 కోట్లు, వైఎస్సార్ పింఛను కానుక 42410 మంది లబ్ధిదారులకు రూ.444.85 కోట్లు, వైఎస్సార్ భరోసా పథకంలో 40570 మంది రైతులకు రూ.93.33 కోట్లు, అమ్మ ఒడి పథకంలో 89220 మంది తల్లులకు రూ.133.83 కోట్లు, వైఎస్సార్ చేయూత 18557 మందికి రూ.58.14 కోట్లు, జగనన్న తోడు పథకంలో 8516 మంది చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాల కింద రూ.2.5 కోట్లు, కాపు నేస్తం పథకంలో 3776 మందికి రూ.9.09 కోట్లు, వాహన మిత్ర పథకంలో 1367 మందికి రూ.3.20 కోట్లు చొప్పున జమ చేయడం జరిగింది.

**అందుబాటులో సేవలు**

సచివాలయాల్లో సుమారు 545 మౌలిక సేవలు అందుబాటులో ఉన్నాయి. అందులో 400 వరకూ గ్రామ స్థాయిలోని ప్రజలకు సేవలు అందుతున్నాయి. వలంటీర్‌ల ద్వారా ఇంటి ముంగిటకే కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు వచ్చి చేరుతున్నాయి. అదేవిధంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది.



జీలుగుమిల్లిలో నాడు-నేడులో రూపుదిద్దుకున్న పాఠశాల



సీతప్పగూడెంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్ భవనాలు



పోలవరంలోని సచివాలయ భవనం



బుట్టాయగూడెం మండలం మర్లగూడెంలో బెంచీలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

#### సచివాలయ వ్యవస్థ బాగుంది



సచివాలయ వ్యవస్థ ద్వారా మాకు చాలా సౌలభ్యం ఏర్పడింది. గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే మండల కేంద్రానికి పరుగులు తీసేవాళ్లం. ఇప్పుడు అన్నీ మా గ్రామంలోనే అందుతున్నాయి. జగనన్న తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది.

– ఎం.రాములు, రైతు, మారేడుబాక, కుక్కునూరు మండలం

#### ఆర్‌బీకే సేవలు భేష్



రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఎరువుల కోసం పరుగులు పెట్టేవాళ్లం. ఇప్పుడు అందుబాటులోనే ఎరువులు ఉన్నాయి. అలాగే ఈ–పంట నమోదు కూడా చేస్తున్నారు. విత్తనాలు అందించడంతోపాటు పంటలపై అవగాహన కలిగిస్తున్నారు.

– సిద్దిన వెంకటరత్నం, రైతు, పోలవరం

#### రూ.3 వేలు పింఛను వస్తుంది



సీఎం జగన్‌బాబు నాకు రూ.3 వేలు పింఛను ఇస్తున్నాడు. వలంటీర్ ద్వారా నేరుగా ఆ డబ్బులు నా చేతికే అందుతున్నాయి. పింఛను కూడా నాకు వలంటీర్‌లే వచ్చేటట్టు చేశారు. నేను ఏ కార్యాలయానికి తిరగలేదు. జగన్‌బాబు మళ్లీ సీఎం కావాలి.

– సరియం వెంకమ్మ, వృద్ధురాలు, సీతప్పగూడెం, బుట్టాయగూడెం మండలం

#### గ్రామస్థాయిలోనే సేవలు



గతంలో ఎన్నడూలేని విధంగా పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. గిరిజన నియోజకవర్గంపై సీఎం జగనన్న ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కృషి చేస్తున్నారు. సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలతో ప్రజలకు గ్రామ స్థాయిలోనే సేవలు అందుతున్నాయి.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

## సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కొదమ జ్యోతి

**జంగారెడ్డిగూడెం రూరల్:** అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సబ్సిడీలను సమావేశంలో వివరించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ రాబోయే వేసవి కాలం దృష్ట్యా ముందస్తుగా గ్రామాల్లో ఎటువంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ జ్వరాల సర్వేలను చేబడుతూ, జ్వర పీడితులు ఉంటే మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రెయినేజీల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## గిరిపల్లెలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్



ముంజులూరు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

**బుట్టాయగూడెం:** మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో గల కొండరెడ్డి గిరిజన గ్రామం ముంజులూరును అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి కొండరెడ్డి గిరిజనుల స్థితిగతులను పరిశీలించారు. గిరిజనుల జీవనోపాధి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీశారు. తమకు పింఛన్లు, రైతు భరోసా, తదితర పథకాలు అందుతున్నాయని చెప్పారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ చేతివృత్తులకు సంబంధించి శిక్షణలు అవసరమైతే జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ దృష్టికి తీసుకువెళ్లి శిక్షణలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి గిరిజనులకు విద్య, వైద్యం అందించడంతోపాటు వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి, కార్యదర్శి బల్లమూడి నాగరాజు, ఏఎన్‌ఎంలు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలి



అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం


**పోలవరం రూరల్:** పోలవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సంఘీభావం తెలుపుతూ ర్యాలీగా సభాప్రాంగణానికి చేరుకున్నారు. విద్యార్థులు, జేఏసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏటిగట్టు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి పోలవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయాలని నినదించారు. అనంతరం జేఏసీ అధ్యక్షులు నాళం గాంధీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వర్తక సంఘం సభ్యులు, ప్రజాసంఘాల సభ్యులు పాల్గొనగా, భారీ బహిరంగసభ నిర్వహించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంతో పోలవరం మండలంలోని 29 గ్రామాల ప్రజలు ఇతర మండలాలకు తరలివెళ్లారన్నారు. దీంతో ఈ ప్రాంతంలో వర్తక, వ్యాపారాలు కుంటుపడ్డాయన్నారు. పోలవరం పేరు రాష్ట్రంలో మార్మోగుతున్నప్పటికీ పోలవరంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. ఎంతో ఘన చరిత్ర గల పోలవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, కేంద్రం నుంచి కూడా నిధులు సమకూరుతాయని పేర్కొన్నారు. పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే సంకల్పంతోనే ఈ సభను ఏర్పాటుచేసినట్లు జేఏసీ అధ్యక్షులు నాళం గాంధీ పేర్కొన్నారు. సభకు పూర్తిగా మద్దతు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**టి.నరసాపురం:** రోడ్డు క్రాసింగ్ లైన్ పనులు జరుగుతున్నందున బుధవారం టి.నరసాపురం 33/11కేవీ సబ్‌స్టేషన్, తిరుమలదేవిపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. టి.నరసాపురం, గుర్వాయిగూడెం, తిరుమలదేవిపేట, శ్రీరామవరం, ఏపుకుంట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

## 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు
- చింతలపూడి మండలంలో సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభోత్సవం



మల్లాయగూడెం సచివాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చింతలపూడి:** రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 నియోజకవర్గాల్లో విజయం సాధించడం ఖాయమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. చింతలపూడి మండలంలో మంగళవారం పార్టీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి అనిల్ కుమార్ యాదవ్, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.విజయరాజులతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత గ్రామంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేయడం అరుదైన విషయమన్నారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు మాత్రం ప్రజలకు డబ్బులు వేసి సోమరిపోతులుగా మారుస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

**మహిళల అభివృద్ధికే అధిక ప్రాధాన్యత**

ఏలూరు ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత దేశంలో ఎక్కడా లేదన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

**దమ్మున్న నాయకుడు జగన్**

మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యం, డా బీఆర్ అంబేడ్కర్ సామాజిక విప్లవం, అబ్దుల్ కలాం మహిళా సాధికారతలను ఏకకాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సాధించారని చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కె విజయరాజు కొనియాడారు. మీ ఇంట్లో మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి, లేకపోతే వద్దు అని ధైర్యంగా చెప్పే దమ్మున్న నాయకుడు జగనన్న అన్నారు. రాష్ట్రానికి మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మల్లాయగూడెంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం చంటి, మండల సచివాలయ కన్వీనర్ తల్లాబత్తుల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

### పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ఎంపీ శ్రీధర్ చింతలపూడి మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్లాయగూడెం–పోతునూరు రైతు భరోసా కేంద్రం, రాఘవాపురంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, సీతానగరంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, ఊటసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మించిన వంతెన, యర్రగుంటపల్లిలో రైతు భరోసా కేంద్రం, తిమ్మిరెడ్డిపల్లిలో సచివాలయం, దేశవరంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు, ప్రగడవరంలో సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ , వెలగలపల్లిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, యర్రంపల్లిలో వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభోత్సవం చేశారు.

## సహకార వ్యవస్థ పటిష్టానికి చర్యలు



రాఘవాపురం సహకార సంఘ కార్యాలయం వద్ద ప్రసంగిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

**చింతలపూడి:** సహకార వ్యవస్థ పటిష్టానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని రాఘవాపురం సహకార సంఘ కార్యాలయం వద్ద చైర్మన్ గిరి భోగారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రంగాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనం దగ్గర నుంచి పంట పండించి కొనుగోలు చేసే వరకు రైతుల బాధ్యతలను రైతు భరోసా కేంద్రాల పర్యవేక్షణలో ప్రభుత్వమే చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో టీడీపీ పాలకులు రైతులను నిర్లక్ష్యం చేశారని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతుల పక్షపాతిగా పాలన చేస్తున్నారని కొనియాడారు. సొసైటీ చైర్మన్ గిరి భోగారావు మాట్లాడుతూ ఆంధ్రా కాల్వ అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి రూ.35 లక్షలు మంజూరు చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుకు సభలో కతజ్ఞతలు తెలిపారు. కాల్వ మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైసీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి అనిల్ కుమార్ యాదవ్, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె విజయరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, పార్టీ రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

### అన్నప్రసాద వితరణ

**జంగారెడ్డిగూడెం:** శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 1500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మంగళవారం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని, మంగళవారం భీష్మ ఏకాదశి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

### బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

**చింతలపూడి:** రాబోయే ఎన్నికలు సజావుగా జరిగేలా బూత్ లెవెల్ అధికారులు ప్రధాన భూమిక పోషించాలని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం చింతలపూడి మండల బూత్ లెవెల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలకు సంబంధించి కొత్త ఓటర్లు అందరినీ చేర్పించాలని, ఓటర్ల జాబితాలో తప్పులు ఉండకూడదని, ప్రతి పోలింగ్ బూత్ మీద నెంబర్‌లు వేయించాలన్నారు. కొత్త పోలింగ్ స్టేషన్‌ల ప్రతిపాదనలు, హోమ్ ఓటింగ్ చేసేందుకు 80 ఏళ్లు నిండిన వృద్ధులను, పీడబ్ల్యూడీ ఓటర్లను గుర్తించాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి తహసీల్దార్‌తోపాటు పాటు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో చిన్న రాటాలు శిక్షణ ఇచ్చారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com